సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం ¦ 8 ¦ జూలై ¦ 2025



పుణ్యక్షేత్రాల వైపు ఆర్టీసీ అడుగులు

ఆర్టీసీ ఆదాయం పెంచుకునే మార్గంలో పుణ్యక్షేత్రాల వైపు అడుగులు వేస్తోంది. ప్రముఖ పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులను నడుపుతోంది. 8లో ▸



నిట్‌లో సీట్లు ఫుల్

జోసా కౌన్సెలింగ్‌లో తొలి విడతలోనే తాడేపల్లిగూడెంలో ఏపీ నిట్‌లో ఉన్న 480 సీట్లకు ఆప్షన్లను విద్యార్థులు ఎంపిక చేసుకున్నారు. 8లో ▸



ట్రిపుల్ ఐటీలో కొరవడిన భద్రత

నూజివీడు ట్రిపుల్ ఐటీలో భద్రత కొరవడింది. శ్రీకాకుళం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉంటున్న హాస్టల్ గదులను అగంతకులు లూటీ చేశారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ

భీమవరం: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)లో అందిన ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యమివ్వాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. సోమవారం భీమవరం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తింటి వేధింపులు తదితర 15 ఫిర్యాదులు అందాయి. అదనపు ఎస్పీ వి.భీమారావు పాల్గొన్నారు.

ఎరువుల కొరత లేదు

భీమవరం: జిల్లాలో డీలర్లు ఎరువులను అనధికారికంగా నిల్వ చేసినా, అధిక ధరలకు విక్రయించినా చర్యలు తప్పవని జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి సోమవారం ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, సార్వా సీజన్‌కు 58,905 టన్నుల అవసరం కాగా ఇప్పటికే 44,792 టన్నుల ఎరువులు ప్రైవేట్ డీలర్లు, ఏపీ మార్క్‌ఫెడ్ వద్ద నిల్వ ఉన్నట్టు పేర్కొన్నారు. జిల్లాలో సుమారు 2.22 లక్షల ఎకరాలకు గాను సుమారు 16 వేల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయని తెలిపారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా



భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన

భీమవరం: మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచి, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారి మల్లేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెల్లబోయిన రంగారావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కొల్లాబత్తుల మహంకాళి డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులు భీమవరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇంజనీరింగ్ సెక్షన్‌లోని పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలన్నారు. అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికుల కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి కేటగిరీల వారీగా రూ.24,500 వరకు వేతనాలు పెంచాలన్నారు.మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు నీలాపు చిత్తరంజన్, నీలాపు శ్రీను, రెల్లా రాము తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ కమిటీని నియమించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వారి సహనాన్ని పరీక్షిస్తోందని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సుధీర్ ప్రకటనలో తెలిపారు. మెరుగైన పీఆర్సీ ఇస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు పీఆర్సీనే కనుమరుగు చేశారని, పెండింగ్ ఉన్న బకాయిలు, సరెండర్ లీవ్‌లు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ లోన్లు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ విషయాల్లో ప్రభుత్వం తాత్సారం చేస్తోందన్నారు. వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమానికి సన్నద్ధమవుతామని హెచ్చరించారు.

సామాన్యులకు వెజి'ట్రబుల్స్'



గణపవరం సంతలో కూరగాయల దుకాణం

గణపవరం: కూరగాయల ధరలు సామాన్యులను కంగారు పుట్టిస్తున్నాయి. కిలో ఉల్లి రూ.20 నుంచి రూ.50కు చేరి కన్నీళ్లు తెప్పిస్తోంది. ఇదే బాటలో మిగిలిన కూరగాయల ధరలు ఉన్నాయి. సోమవారం గణపవరం సంతలో కిలో ధరలు ఇలా ఉన్నాయి. ఉల్లి రూ.40 నుంచి రూ.50, పచ్చిమిర్చి రూ.70, బీర రూ.60, వంకాయలు రూ.60, బెండ రూ.50, క్యారెట్ రూ.50, బీట్‌రూట్ రూ.50, దోస రూ.30, దొండ రూ.40, కాకర రూ.60, ఆకాకర రూ.80, కీరదోస రూ.80, కంద రూ.50, చిక్కుడు రూ.120, టమాట రూ.60, అల్లం రూ.120, మునగ రూ.10, ఆనప రూ.30, బీన్స్ రూ.80, క్యాప్సికం రూ60, క్యాబేజీ రూ.50, కాలిఫ్లవర్ రూ.50 చొప్పున పలికాయి. తోటకూర, గోంగూర, పాలకూర తదితర రకాలు కట్ట రూ.20 చొప్పున విక్రయించారు.

పశ్చిమపై రాజముద్ర



జన హృదిలో రాజన్న

- జిల్లాతో వైఎస్సార్‌కు ఆత్మీయ అనుబంధం
- ఆరోగ్యశ్రీ, 108, 104లతో వైద్య భరోసా
- వ్యవసాయాన్ని పండుగ చేసిన మహానేత
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో పేద విద్యార్థులకు వెలుగులు
- గూడెంలో ఉద్యాన వర్సిటీ ఏర్పాటు
- నేడు వైఎస్సార్ జయంతి
- విస్తృతంగా సేవా కార్యక్రమాలు



వైఎస్సార్ హయాంలో తాడేపల్లిగూడెంలో ఏర్పాటు చేసిన ఉద్యాన వర్సిటీ

సాక్షి, భీమవరం: వైఎస్సార్.. ఈ పేరే ఓ వైబ్రేషన్.. ఆయన అమలుచేసిన పథకాలు వ్యవసాయాన్ని పండుగ చేశాయి.. పేదల సొంతింటి కలను సాకారం చేశాయి.. వారి పిల్లలను ఇంజినీర్లు, డాక్టర్లు, ఉన్నత విద్యావంతుల్ని చేశాయి.. మందు బిళ్లలు కూడా కొనలేని నిరుపేదలకు లక్షలు ఖరీదు చేసే కార్పొరేట్ వైద్యాన్ని అందించాయి.. ఇందిరమ్మ, జలయజ్ఞం, 108, 104, పింఛన్లు, పావలావడ్డీ, రుణమాఫీ.. ఇలా ఎన్నో సంక్షేమ పథకాలు బడుగు బలహీన వర్గాల వారి ఉజ్వల భవితకు బాటలు వేశాయి. అందుకే వైఎస్ పేరు వింటే పేదలకు ఓ భరోసా.. ఏ కష్టమొచ్చినా కొండంత అండ ఉందన్న ధీమా.

నేడు సేవా కార్యక్రమాలు

నమస్తే అక్కయ్యా.. నమస్తే చెల్లెమ్మా.. నమస్తే.. నమస్తే.. నమస్తే బాబు.. నమస్తే పాప.. నమస్తే.. నమస్తే.. నమస్తే. అంటూ ఆత్మీయంగా పిలిచే ఆ పెద్దాయన దివికేగి ఏళ్లు గతించినా పేదల గుండెల్లో గూడుకట్టుకుని ఉన్నారు. వైఎస్ 76వ జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా అంతటా వేడుకలు, పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాల నిర్వహణకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు ఏర్పాట్లు చేశారు.

జిల్లాతో అనుబంధం

పశ్చిమగోదావరి జిల్లాతో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డికి ప్రత్యేకమైన అనుబంధం ఉంది. రాజకీయ ప్రస్థానంలో పలుమార్లు జిల్లాకు విచ్చేసిన వైఎస్సార్ ఇక్కడి ప్రజలతో మమేకమయ్యేవారు. అందరితో ఆప్యాయంగా మాట్లాడేవారు. చోటామోటా నాయకుల పేర్లను సైతం గుర్తుపెట్టుకుని పలకరించడం వారినెంతో అబ్బురపరిచేది.

పశ్చిమాన ప్రగతి పరవళ్లు

- దక్షిణ భారతదేశంలోనే మొదటిగా 2007లో ఉద్యాన యూనివర్సిటీని తాడేపల్లిగూడెం రూరల్ వెంకట్రామన్నగూడెంలోని 220 ఎకరాల్లో ఏర్పాటుచేశారు. రూ.40 కోట్ల ప్రాథమిక వ్యయంతో అంచెలంచెలుగా అభివృద్ధి చేయగా నేడు దేశవ్యాప్తంగా ఉద్యాన రైతులకు సేవలు అందిస్తోంది. ఈ వర్సిటీ ద్వారా 14 ఉద్యాన పంటలకు సంబంధించి 23 రకాల వంగడాలు ప్రాచుర్యంలోకి వచ్చి రైతులకు సాగును లాభదాయకం చేస్తున్నాయి.
- పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ఇందిరమ్మ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలుచేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి భీమవరం పట్టణ పరిధిలో 82 ఎకరాలు, ఆకివీడు మండలం తాళ్లకోడులో 74 ఎకరాలు, నరసాపురంలో 15 ఎకరాలు, పాలకొల్లులో 70 ఎకరాలు, పెనుగొండలో 36 ఎకరాలు, తణుకులో 14 ఎకరాలు, జిల్లా వ్యాప్తంగా వందల ఎకరాలు సేకరించి వేలాది మందికి సొంత గూడును సమకూర్చారు.
- ఆరోగ్యశ్రీ ద్వారా దాదాపు 32 వేల మందికి దాదాపు రూ.150 కోట్ల విలువైన వైద్యసేవలు అందించారు. అర్హులందరికీ పింఛన్ల మంజూరు, పావలా వడ్డీ రుణాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలు ద్వారా ప్రజలకు ఎన్నో మేళ్లు చేశారు.
- డెల్టా ఆధునికీకరణలో భాగంగా సుమారు రూ.140 కోట్లతో కాలువలను అభివృద్ధి చేయడంతో పాటు రుణమాఫీ, పావలా వడ్డీ రుణాలు, ఉచిత విద్యుత్, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు తదితర కార్యక్రమాల ద్వారా వ్యవసాయాన్ని పండుగ చేశారు.
- భీమవరంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు-2, యనమదుర్రు డ్రెయిన్‌పై ఐదు వంతెనలు, నరసాపురం రూరల్ పేరుపాలెం బీచ్‌కు అనుసంధానంగా రోడ్లు, బీచ్ అభివృద్ధి, పాలకొల్లు మండలం శివదేవుని చిక్కాలలో సాగునీటి ఎత్తిపోతల పథకం, తాడేపల్లిగూడెంలో వెటర్నీ పాలిటెక్నిక్ కళాశాల స్థాపన, ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్, రూ.34 కోట్లతో యాగర్లపల్లి వద్ద రెండో ఫ్లైఓవర్, ఎర్రకాలువపై అప్పారావుపేట, వీరంపాలెం, మాధవరం-కంసాలిపాలెం వద్ద మూడు వంతెనలు, మోడ్రన్ లైబ్రరీ తదితర అభివృద్ధి పనులు వైఎస్ హయాంలో జరిగినవే కావడం గమనార్హం.

వైఎస్సార్ ప్రాణదాత





నాపేరు చించినాడ పుణ్యవతి. పెనుమంత్ర మండలం భట్లమగుటూరులో రజక సామాజిక వర్గానికి చెందిన పేద కుటుంబం మాది. 16 ఏళ్ల క్రితం 50 ఏళ్ల వయసులో నాకు కేన్సర్ సోకింది. రూ.లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకునే స్తోమత లేదు. నాకు ఆయుష్షు పెంచిన మహానుభావుడు వైఎస్ రాజశేఖరరెడ్డి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పైసా ఖర్చులేకుండా ఉచిత వైద్య సాయం అందింది. ఆ మహానుభావుడి మేలు మరువలేం. లారీ డ్రైవర్‌గా పనిచేసే నా కుమారుడు కష్టపడి తెచ్చిన సొంత డబ్బులతో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటుచేశాడు.

విద్యార్థుల భవితకు బాట



నరసాపురానికి చెందిన నా పేరు నిప్పులేటి సత్యనారాయణ. సైకిల్ మెకానిక్ పని జీవనాధారం. మా ఇద్దరు పిల్లలు బాగా చదువుతున్నా.. ఉన్నత చదువులకు ఆర్థిక పరిస్థితులు సహకరించేవి కావు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా మా అమ్మాయి శ్రీరామదుర్గ ఎమ్మెస్సీ పూర్తి చేసి గోల్డ్ మెడల్ సాధించింది. జగన్ హయాంలో మా అబ్బాయి మహేష్‌బాబు ఇంజనీరింగ్ పూర్తి చేసి టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం సాధించాడు. ఈ రోజు మా కుటుంబం ఆనందంగా ఉండటానికి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో చదివించడమే ప్రధాన కారణం.

ఆరోగ్యశ్రీ బతికించింది



2008లో నాకు తీవ్ర అనారోగ్యం చేసింది. కడుపులో పెద్ద కణితి ఉంది ఆపరేషన్ చేయాలని వైద్యులు అన్నారు. నిరుపేదనైన నేను డబ్బులు పెట్టి చేయించుకోలేని పరిస్థితిలో ఉన్నాను. ఆరోగ్యశ్రీలో వైద్యులు ఉచితంగా ఆపరేషన్ చేసి కడుపులోని కణితిని తొలగించారు. ఆరోగ్యశ్రీ లేకపోతే నా పరిస్థితి ఏంటని తలుచుకుని ఇప్పటికీ భయపడతాను.

– ఉరదాల సన్యాసమ్మ, భీమవరం

గూడు సమకూర్చిన దేవుడు



ఈరోజు సొంత ఇల్లు కట్టుకుని హాయిగా జీవిస్తున్నామంటే అది రాజన్న దయే. ఆయన హయాంలోనే తాళ్లకోడులో ఇళ్ల స్థలాలు సేకరించి పేదలకు పంచారు. తర్వాత వచ్చిన నాయకులు పట్టించుకోలేదు. ఆయన తనయుడు జగన్‌బాబు వచ్చాక ఇంటి నిర్మాణానికి సాయం అందజేయడంతో మా ఇంటి కల నెరవేరింది.

– పిల్ల అప్పయమ్మ, జగనన్న కాలనీ, తాళ్లకోడు, కుప్పనపూడి

ఆక్వా తూకాల్లో మోసాలు



మాట్లాడుతున్న ఆక్వా రైతు సంఘ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: ఆక్వా రైతులు అప్రమత్తంగా ఉంటూ ట్రేడర్లు సరుకు తూకం వేసే సమయంలో కాటాను ముందుగానే పరిశీలించుకోవాలని జై భారత్ క్షీరారామ ఆక్వా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి బోణం చినబాబు అన్నారు. సోమవారం స్థానిక రైతు సంఘ భవనంలో విలేకరులతో మాట్లాడారు. ట్రేడర్లు తీసుకువచ్చే ఎలక్ట్రానిక్ కాటాలను రైతులు ముందుగానే పరిశీలించుకోవాలని, కేజీల్లో తూయాల్సిన కాటాలను లీటర్లలో కాటా వేస్తూ సుమారు 80 గ్రాముల వరకూ దోచుకుంటున్నారన్నారు. ట్రేడర్లతో దళారులు జతకట్టి మోసాలకు పాల్పడుతున్నారనే అనుమానం కలుగుతోందన్నారు. యలమంచిలి మండలం మేడపాడు గ్రామానికి చెందిన ఆక్వా రైతు చామకూరి దినకర్ మాట్లాడుతూ తాను ట్రేడర్ తీసుకువచ్చిన కాటాను పరిశీలించగా బాగానే ఉందని, ఈలోపు పట్టుబడి పడుతున్న ప్రాంతం వద్దకు వెళ్లగా కాటాను ట్యాంపరింగ్ చేశారన్నారు. విషయాన్ని గుర్తించి ఆక్వా రైతు సంఘం సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి మోసాన్ని గుర్తించారన్నారు. వేరే కంపెనీతో మాట్లాడి సరుకును అమ్మించి సొమ్ము ఇప్పించారన్నారు. కాటా మోసం చేసిన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టగా ట్రేడర్‌కు చెందిన వ్యక్తులు సుమారు వంద మంది వచ్చి తనను బెదిరించారన్నారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు పి.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

బంధాన్ని కాదని.. అనుబంధాన్ని తెంచుకుని..





తణుకు ఆస్పత్రిలో వృద్ధుడి కుమారుడు సుధీర్‌రాజుకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఆర్ఎంఓ, వృద్ధుడు సుబ్బారావు

- రైలు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు
- తండ్రిని వద్దంటున్న కుమారుడు.. భర్త లేడంటున్న భార్య

తణుకు అర్బన్: వివాహ బంధాన్ని భార్య వద్దంటోంది. కన్నతండ్రితో అనుబంధాన్ని కుమారుడు తెంచుకుంటున్నాడు. ఏడేళ్ల క్రితం తెగిపోయిన రక్తసంబంధం నేడు ఎదురైనా తమకు వద్దంటే వద్దని ఆ కుటుంబం తెగేసి చెబుతోంది. దీంతో ప్రమాదవశాత్తు గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు అల్లాడుతున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంకు చెందిన కలగర సుబ్బారావు ఏడేళ్ల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. ఆదివారం కాల్దరి స్టేషన్‌లో రైలు నుంచి జారిపడగా రైల్వే పోలీసులు తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వృద్ధుడిని ఆరా తీయగా కుటుంబసభ్యుల వివరాలు తెలిపారు. రైల్వే కానిస్టేబుల్ బాల విషయాన్ని వృద్ధుడి కుమారుడు సుధీర్‌రాజుకు ఫోన్ ద్వారా తెలియజేయగా తనకు నాన్న అవసరం లేదని తెగేసి చెప్పాడు. అయినా కానిస్టేబుల్ బాల ప్రకాశరావుపాలెంలోని ఇంటికి వెళ్లి వృద్ధుడి భార్యతో విషయం చెప్పగా తన భర్త ఎప్పుడో చనిపోయాడని, అతడి మరణ ధ్రువీకరణ పత్రం తీసుకుని వితంతు పింఛను కూడా పొందుతున్నట్టు సమాధానం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఆశ్చర్యపోయారు.

కేసు నమోదు చేసినా ఇబ్బంది లేదు

సుధీర్‌రాజును ఎట్టకేలకు రైల్వే పోలీసులు తణుకు ఆస్పత్రికి తీసుకురాగా సోమవారం ఆర్ఎంఓ డాక్టర్ ఏవీఆర్ఎస్ తాతారావు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమకు సుబ్బారావు అవసరం లేదని, అవసరమైతే అలా రాసిస్తామని సుధీర్‌రాజు సమాధానమిచ్చాడు. దీంతో సీఐ ఎన్.కొండయ్య ఆస్పత్రి వద్దకు వచ్చి కన్న తండ్రిపై నిర్లక్ష్యం వహిస్తే కేసు నమోదు చేస్తామని హెచ్చరించగా.. కేసు నమోదు చేసుకోమని సుధీర్ రాజు తెగేసి చెప్పాడు. దీంతో చేసేదిలేక ఆస్పత్రి లోనే వైద్యులు సుబ్బారావుకు చికిత్స అందిస్తున్నారు.

అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

కలెక్టర్ నాగరాణి



పీజీఆర్ఎస్‌లో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..

- పెనుమంట్ర మండలం పొలమూరు పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌కు సంబంధించిన టెండర్లు సక్రమంగా జరగలేదని సుంకర సాయి ఫిర్యాదు చేశారు.
- భీమవరం మండలం దిరుసుమర్రుకి చెందిన వృద్ధురాలు పేరిచర్ల చంద్రకాంతం తన కుమారులు, కుమార్తెలు తనను చూడటం లేదని, తన కున్న 242 గజాల స్థలాన్ని చిన్నకుమారుడు బలవంతంగా వేలిముద్రలు వేయించుకుని రాయించుకున్నాడని ఫిర్యాదు చేశారు.
- వీరవాసరం మండలం నందమూరుగరువుకు చెందిన చింత వెంకన్న బ్రెయిన్ స్ట్రోక్‌తో మంచానికే పరిమితమయ్యాయని, రూ.15 వేల పింఛన్ మంజూరు చేయాలని కోరారు.
- యలమంచిలి మండలం అడవిపాలేనికి చెందిన ఉండ్రాజవరపు రూతమ్మ తనకు ఒంటరి మహిళ పింఛన్‌ను పునరుద్ధరించాలని అర్జీ అందించారు.
- భీమవరం మండలం జొన్నలగరువు చిన్నపేటకు చెందిన బొడ్డు రాజేశ్వరి తనకున్న ఐదు సెంట్ల స్థలాన్ని సర్వే చేయించాలని కలెక్టర్‌కు అర్జీ అందించారు.


కాటా మోసాలపై ఫిర్యాదు



వినతిపత్రాలతో ఆక్వా రైతులు

రొయ్యలను తూచే ఎలక్ట్రానిక్ కాటాలో మోసాలు జరుగుతున్నాయని జిల్లాలోని ఆక్వా రైతులు కలెక్టర్ నాగరాణికి ఫిర్యాదు చేశారు. ప్రాన్ ఫార్మర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జీకేఎఫ్ సుబ్బరాజు, వీరవాసరం మండలం ఆక్వా రైతుల సంఘం అధ్యక్షుడు తులసీరామ్ మాట్లాడుతూ రొయ్యల కొనుగోలు చేసే సమయంలో కాటాలో మోసాలతో రైతులు నష్టపోతున్నారన్నారు. కాటాలో మోసాలు అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఆక్వా రైతులు వీరవల్లి చంద్రశేఖర్, రాయకుదురు బుజ్జి, పెనుమత్స వర్మ తదితరులు ఉన్నారు.

ట్రాకింగ్‌తో 208 సెల్‌ఫోన్ల రికవరీ



బాధితులకు సెల్‌ఫోన్లు అందిస్తున్న ఎస్పీ

భీమవరం: జిల్లాలో సెల్‌ఫోన్ ట్రాకింగ్ ద్వారా పదో విడతలో సుమారు రూ.31.20 లక్షల విలువైన 208 సెల్‌ఫోన్లు రికవరీ చేసినట్టు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. సోమవారం భీమవరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు రికవరీ చేసిన సెల్‌ఫోన్లు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో 4,990 ఫిర్యాదులు అందగా వాటిలో రూ.2.40 కోట్ల విలువైన 1,612 ఫోన్లు రికవరీ చేశామన్నారు. ఎవరికైనా సెల్‌ఫోన్ దొరికితే సొంతానికి వాడుకోకుండా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో అందించాలన్నారు. అలాగే గుర్తుతెలియని వ్యక్తుల వద్ద బిల్లులు లేని సెల్‌ఫోన్లు కొనుగోలు చేయరాదన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకుంటే సెల్ చాట్ బాక్స్ 91549 66503 నంబర్‌కు హెచ్ఏఐ అని మెసేజ్ చేసి వచ్చిన లింకును నింపి సబ్మిట్ చేసి ఫిర్యాదుల చేయాలని సూచించారు. అనంతరం సెల్‌ఫోన్ల రికవరీకి కృషి చేసిన భీమవరం మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ అహ్మదున్నిసా, ఎస్సై ఎన్.నాగేశ్వరరావు, సిబ్బంది డి.రత్నారెడ్డి, వీజీఎస్ కుమార్, బి.శ్రీనివాస్, కె.వెంకటేశ్వరరావు, పి.లక్ష్మీకుమారి, కె.పాపారావు, కె.ప్రసాద్‌బాబు, ఎస్.భాస్కర్, ఎంవీడీ ప్రసాద్, ఎం.అనిల్‌కుమార్, కె.అబ్బాస్, కె.కాంతిని అభినందించారు. అడిషనల్ ఎస్పీ వి. భీమారావు పాల్గొన్నారు.

పీపీలకు ల్యాప్‌టాప్‌లు



పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

ఏలూరు టౌన్: జిల్లాలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు సోమవారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ చేతులమీదుగా ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ న్యాయవ్యవస్థలో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ప్రభుత్వం ల్యాప్‌టాప్‌లు అందించిందన్నారు. ఏలూరు జిల్లావ్యాప్తంగా న్యాయస్థానాల్లోని పీపీలు, ఏపీపీలకు ల్యాప్‌టాప్స్ అందజేశామన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



తేతలిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మునిస్వామి

తణుకు అర్బన్: కలెక్టర్‌కు చెప్పుకుందాం రండి కార్యక్రమంలో గీత కార్మికులు వారి కుటుంబాలు, పాల్గొనాలంటూ సోమవారం తణుకు మండలం తేతలి గ్రామంలో గీత కార్మికులు కరపత్రాలను పంపిణీ చేశారు .ఈ సందర్భంగా గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కామన మునిస్వామి మాట్లాడుతూ బెల్టు షాపు పెడితే తాట తీస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటిస్తున్నా జిల్లాలో సుమారు 4వేల బెల్ట్ షాపులు అక్రమంగా నడుస్తున్నాయని విమర్శించారు. గీత కార్మికులకు ఉపాధి కల్పించాలని, అలాగే ఏడాదిలో పనిలేని 8 నెలలను వర్క్ హాలిడేగా ప్రకటించి ప్రభుత్వం సాయం చేయాలని డిమాండ్ చేశారు. మత్స్యకారులకు ఇస్తున్నట్లుగా రూ.20వేలు అందించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14వ తేదీన గీత కార్మికులు కలెక్టరేట్‌కు ఐక్యంగా వచ్చి సమస్యలను తెలియజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గీత కార్మికులు కాసాని శ్రీనివాసు, కట్టా శ్రీరామమూర్తి, అయినా నాగులు, ఆరెవెల్లి సీతారామయ్య, అంగర పోతురాజు, చేబ్రోలు రాజు, ఆరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొని గిరిజనుడి మృతి

వేలేరుపాడు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని గిరిజన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరం గ్రామానికి చెందిన మడకం ప్రకాష్ మొహర్రం (పీర్లపండుగ)ను పురస్కరించుకొని సోమవారం మధ్యాహ్నం కన్నాయిగుట్ట గ్రామానికి తన ద్విచక్రవాహనంపై బయలు దేరాడు. వేలేరుపాడు మండల పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడ్ని వైద్యం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ప్రకాష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. వేలేరుపాడు ఎస్సై నవీన్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో కొరవడిన భద్రత

- శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ విద్యార్థుల హాస్టల్ గదుల లూటీ
- పలు రూమ్‌ల తాళాలు పగులగొట్టి, గదులు విరగ్గొట్టి చోరీ
- విద్యార్థులు వేసవి సెలవులకు వెళ్లి వచ్చాక వెలుగు చూసిన వైనం



ఐ1 హాస్టల్ భవనం



విద్యార్థుల హాస్టల్ గదుల్లో చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు



తలుపు వద్ద తాళం రాకపోయే సరికి గడిని ఊడగొట్టిన ఆగంతకులు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో భద్రత కొరవడింది. ట్రిపుల్ ఐటీలోని శ్రీకాకుళం ఇంజినీరింగ్ విద్యార్థులు ఉంటున్న ఐ1 హాస్టల్ భవనంలోని మూడో అంతస్తులో ఉన్న హాస్టల్ గదులను ఆగంతకులు లూటీ చేశారు. ఇంజనీరింగ్ తృతీయ సంవత్సర విద్యార్థులు వేసవి సెలవులకు వెళ్లి జూలై ఐదో తేదీ నుంచి తిరిగి రావడంతో హాస్టల్ గదుల్లో చోరీ జరిగిన విషయం వెలుగు చూసింది.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి చెందిన ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం, మూడో సంవత్సరం విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్ ఐటీలోనే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో ఐ1 హాస్టల్ వసతి గృహంలోని రెండో ఫ్లోర్‌లో నాలుగో సంవత్సరం విద్యార్థులు, మూడో అంతస్తులో తృతీయ సంవత్సర విద్యార్థులు ఉంటున్నారు. మే 15 నుంచి వేసవి సెలవులు ఇవ్వడంతో ఈ 4 విద్యార్థులు తమ సామగ్రినంతా తీసుకొని హాస్టల్ గదులను ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఈ3 విద్యార్థులు మాత్రం తమ దుస్తులను, ట్రాలీ బ్యాగ్‌లను, పుస్తకాలను, షూలను ఇతర సామగ్రిని తమ గదుల్లోనే ఉంచి తాళాలు వేసుకొని ఇళ్లకు వెళ్లారు. అయితే ఈ విద్యాసంవత్సరం నుంచి ఈ4 విద్యార్థులకు తరగతులు శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లోనే నిర్వహిస్తున్నామని, నూజివీడులో ఈ3 పూర్తి చేసుకున్న విద్యార్థులందరూ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు వచ్చేయాలని ట్రిపుల్ ఐటీ అధికారులు ఫోన్‌లకు మెసేజ్‌లు పెట్టారు. దీంతో వారంతా తమ సామగ్రిని తీసుకెళ్లేందుకు నూజివీడు ట్రిపుల్ ఐటీకి వచ్చి తమ రూమ్‌లకు వెళ్లగా తాళాలు పగులగొట్టి, లోపలి దుస్తులను, పుస్తకాలను చిందరవందరగా పడేసి ఉండటం చూసి ఒక్కసారిగా అవాక్కయ్యారు. మూడో అంతస్తులో దాదాపు 100 గదులు ఉండగా 30 గదుల వరకు తాళాలు పగులగొట్టి, గదులు పగుల గొట్టి విద్యార్థుల పుస్తకాలను, దుస్తులను చిందరవందరగా పడేయడంతో పాటు సూట్‌కేసులు, ట్రాలీ సూట్‌కేసులు, కొందరి ల్యాప్‌ట్యాప్‌లు, విద్యార్థుల బూట్లు చోరీ చేశారు. ఇంత పెద్ద ఎత్తున లూటీ జరిగినా సమాచారం బయటకు పొక్కకుండా ట్రిపుల్ ఐటీ అధికారులు అది విషయమే కానట్లుగా వ్యవహరిస్తున్నారు. తమ గదుల్లోని వస్తువులు చోరీకి గురికావడంపై విద్యార్థులు మెయిల్ ద్వారా యూనివర్సిటీ ఛాన్సలర్ దృష్టికి సైతం తీసుకెళ్లారు. హాస్టల్ గదులకు కూడా భద్రత లేకపోతే ఎలాగని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.

సెక్యూరిటీ వ్యవస్థ నిద్రపోతోందా..!

ట్రిపుల్ ఐటీలో 24 గంటలూ సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. షిఫ్టుకు 55 మంది చొప్పున మూడు షిఫ్టులు విధుల్లో ఉంటారు. అలాగే హాస్టల్ భవనంలో నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన కేర్ టేకర్, శ్రీకాకుళంకు చెందిన కేర్ టేకర్‌లు విధుల్లో ఉంటారు. హాస్టల్ భవనం వద్ద సైతం 24 గంటలూ సెక్యూరిటీ సిబ్బంది కాపలా కాస్తూ ఉంటారు. అంతేగాకుండా ట్రిపుల్ ఐటీలో పోలీస్ అవుట్‌పోస్టు సైతం ఉంది. అయినప్పటికీ విద్యార్థుల రూమ్‌ల తాళాలు పగులగొట్టి, గదులను విరగ్గొట్టి చోరీలకు పాల్పడటం సంచలనంగా మారింది. గతంలో రెండుసార్లు ఫ్యాకల్టీ గృహాల్లో సైతం దొంగతనాలు జరిగాయి. వాటికి సంబంధించి దర్యాప్తు ఇంత వరకు అతీగతీ లేదు. ఇప్పుడు తాజాగా విద్యార్థుల హాస్టల్ గదుల్లో జరగడం విస్మయాన్ని కలిగిస్తోంది. ఇప్పటికైనా చోరీకి పాల్పడిన వారు ఎవరో నిగ్గు తేల్చాల్సిన బాధ్యత యాజమాన్యంపైన, పోలీసులపైనా ఉంది.

మదినిండా పెద్దాయనే..



మైక్రోఆర్టిస్ట్ సురేష్ సృజనతో అగ్గిపుల్లపై వైఎస్ చిత్రం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ముఖ్యమంత్రిగా, ప్రజానేతగా వైఎస్ రాజశేఖర రెడ్డి అందించిన సేవలు ఇప్పటికీ ప్రజల హృదయాల్లో పదిలమే. అందుకే ఆయన్ను రాష్ట్రమంతా పెద్దాయనగా పిలుచుకుంటుంది. ఆ మహనీయుడి జయంతి సందర్భంగా నగరానికి చెందిన మైక్రో ఆర్టిస్టులు తమ కళ ద్వారా వైఎస్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఏలూరుకు చెందిన మైక్రో ఆర్టిస్ట్ ప్రసాద్ వైఎస్ చిత్రపటాన్ని రావి ఆకుపై చిత్రించి తన అభిమానాన్ని చాటుకోగా, మరో మైక్రో ఆర్టిస్ట్ మేతర సురేష్ అగ్గిపుల్లపై వైఎస్ చిత్రాన్ని చిత్రించి కృతజ్ఞత చాటుకున్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎందరికో ప్రాణభిక్ష పెట్టడమే కాకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులు ఉన్నత చదువులకు కృషి చేసిన మహామనిషి వైఎస్సార్ అని మైక్రో ఆర్టిస్టులూ తమ అభిప్రాయం వ్యక్తం చేశారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: కుమార్తె అదృశ్యంపై ఆమె తల్లి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ శంకరరావు తెలిపారు. మండలంలోని చిగురుకోట శివారు నరసన్నపాలెంకు చెందిన మహిళ తన కుమార్తె పదో తరగతి వరకు చదువుకుని కూలి పనులకు వెళుతుందని, సోమవారం తెల్లవారుజాము నుంచి కనిపించడంలేదని పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వైఎస్ పాలనలో ఏజెన్సీలో అభివృద్ధి పరుగులు



దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికి ఏజెన్సీ సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు (ఫైల్)

బుట్టాయగూడెం: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పశ్చిమ ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. సోమవారం సాయంత్రం దుద్దుకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైఎస్సార్‌తో ఆయనకున్న అనుబంధం, వైఎస్సార్ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. గిరిజన విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమై డ్రాప్‌ఔట్స్‌గా మిగులుతున్న సమయంలో జూనియర్, డిగ్రీ, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేసి ఉన్నత విద్యల్లో ముందుకు సాగే విధంగా వైఎస్ కృషి చేశారన్నారు. అదేవిధంగా నియోజకవర్గ స్థాయిలో 70 వేల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిన ఘనత వైఎస్సార్‌దే అని అన్నారు. 400 కిలోమీటర్ల మేర బీటీ రోడ్ల నిర్మాణానికి కృషి చేసి రహదారుల సమస్య లేకుండా చేశారన్నారు. అదే విధంగా అటవీ హక్కుల చట్టంలో సుమారు 10 వేల ఎకరాలకు పైగా భూములను పేదలకు వైఎస్సార్ పంచడం జరిగిందని గుర్తుచేశారు. రూ. 26 కోట్ల వ్యయంతో గిరిజనుల బీడు భూములకు సాగు నీరు అందించే విధంగా పోగొండ రిజర్వాయర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి ఏటా కొండ కాలువల ప్రవాహానికి అనేక మంది గిరిజనులు మృతి చెందుతుంటే వాటిని నివారించేందుకు రూ.26 కోట్లతో నాలుగు ప్రదేశాల్లో హైలెవెల్ బ్రిడ్జిల నిర్మాణానికి కృషి చేశారన్నారు.

వైఎస్ చలువతోనే పోలవరం ప్రాజెక్టు

పోలవరం మండలంలో ప్రతి ఏటా గోదావరి వరదనీరు ప్రవాహానికి 50 వేల ఎకరాల పంట భూములు ముంపునకు గురై రైతులు అనేక ఇబ్బందులు పడేవారన్నారు. దీంతో చిరకాల స్వప్నమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వైఎస్ చలువతోనే ప్రారంభమైందని చెప్పారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సుమారు రూ.70 కోట్లతో కొవ్వాడ ఔట్ పాల్స్ స్లూయిస్ పనులకు శ్రీకారం చుట్టారని చెప్పారు. అలాగే గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని 5 ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు జంగారెడ్డిగూడెంలో 100 పడకల నిర్మాణానికి కృషి చేశారని తెలిపారు. ఇలా వైఎస్సార్ పాలనలో తాము ఏ సమస్య అయినా దరఖాస్తు రూపంలో అందజేస్తే వెనువెంటనే నిధులు మంజూరు చేసేవారని చెప్పారు. నాడు వైఎస్సార్ చేసిన అభివృద్ధి పనులను చూసి రాజశేఖరరెడ్డిని దేవుడిగా కొలుచుకుంటున్నారని చెప్పారు. మళ్లీ అదే రీతిలో తండ్రి బాటలో పాలన చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన ప్రాంత అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని చెప్పారు.

నిట్‌లో సీట్లు ఫుల్

- ఆరో రౌండ్ తర్వాత చేరికలు
- ఎంటెక్ తరగతులు త్వరలో ప్రారంభం
- హెఫా నిధుల కోసం నిరీక్షణ



ఏపీ నిట్

తాడేపల్లిగూడెం: జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) పర్యవేక్షణలో జాతీయ విద్యాసంస్థలైన నిట్ తదితర సంస్థల్లో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటి వరకు రెండు రౌండ్లు ముగియగా మరో ఆరు రౌండ్లు మిగిలాయి. తొలి విడతలోనే ఏపీ నిట్‌లో ఉన్న 480 సీట్లకు ఆప్షన్లను విద్యార్థులు ఎంపిక చేసుకున్నారు. మొదటి రౌండ్‌లోనే సీట్లు భర్తీ అయ్యాయి. నిట్‌లో ఉన్న ఎనిమిది బ్రాంచిలలో చేరడానికి విద్యార్థులు ఫ్లోట్ (బ్రాంచి మారడానికి వీలుగా) ఫ్రీజింగ్ (సీటు నిర్ధారణ చేసుకోవడం)వంటి ఐచ్ఛికాలను ఎంపిక చేసుకున్నారు. హోమ్ స్టేట్ కోటా కింద 240 మంది, అదర్ స్టేట్ కోటా కింద 240 మంది ఆప్షన్లను ఎంపిక చేసుకోగా, మిగిలిన నాలుగు రౌండ్లు ముగిసిన తర్వాత వెరిఫికేషన్ కేంద్రాల్లో జోసా నుంచి తుది జాబితా వచ్చిన తర్వాత సర్టిఫికెట్లను పరిశీలన చేసిన తర్వాత నిట్‌లో విద్యార్థులు చేరే ప్రక్రియ పూర్తి కానుంది. తర్వాత ఇండక్షన్, తరగతుల ప్రారంభం కార్యక్రమాలు జరగాల్సి ఉంది. ఆగస్టు నెల వరకు విద్యార్థులు ప్రాంగణానికి వచ్చే అవకాశాలు లేవు.

ఎంటెక్ సీట్ల భర్తీ ప్రక్రియ షురూ

కొంతకాలం విరామం తర్వాత ఏపీ నిట్‌లో ఎంటెక్ కోర్సు ప్రారంభం కానుంది. ఎంటెక్ కోర్సులో ఇక్కడ 99 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సు కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించే ప్రక్రియ ప్రారంభమైంది. వంద సీట్లు పైన ఉంటేనే ఆయా నిట్‌కు వెరిఫికేషన్ సెంటర్ ఇస్తారు. ఏపీ నిట్‌లో 99 సీట్లు ఉండటంతో ఇక్కడకు వచ్చిన దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం నిట్ రాయపూర్‌లో ఏర్పాటుచేశారు.

హెఫా నిధుల కోసం నిరీక్షణ

ఏపీ నిట్‌లో రెండోదశ పనుల కోసం రూ.430 కోట్ల ప్రతిపాదనతో కెనరా బ్యాంకు ద్వారా హైర్ ఎడ్యుకేషన్ ఫండింగ్ ఏజన్సీ(హెఫా) నుంచి నిధుల కోసం కేంద్ర ఉన్నత విద్యాశాఖకు వినతులు పంపారు. ఏపీ నిట్‌కు బోర్డు ఆఫ్ గవర్నెన్సు(బీఓజీ) చైర్మన్ లేకపోవడం, పాత చైర్‌పర్సన్ పదవీకాలం ముగిసి ఏడాది గడుస్తున్నా , ఇంకా ఆ స్థానంలో చైర్మన్ ఎంపిక జరుగలేదు. నిధుల్లో కదలిక లేకపోవడానికి ఇది ఒక కారణంగా తెలుస్తోంది.

ట్రిపుల్ ఐటీలో చోరీ యాజమాన్య వైఫల్యమే

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నూజివీడు ట్రిపుల్ ఐటీలో చోరీ పూర్తిగా యాజమాన్య వైఫల్యమేనని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే లెనిన్ విమర్శించారు. స్థానిక ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నూజివీడు పట్టణంలో ఉన్న ట్రిపుల్ ఐటీ కళాశాల విద్యార్థులు మే నెలలో సెలవులకు వెళ్లి ఈనెలలో తిరిగి రాగా వారికి కేటాయించిన బ్లాక్ ఐ మూడవ అంతస్తులో దాదాపు 80 రూముల్లో చోరీ జరిగినట్లు తమ దృష్టికి తీసుకువచ్చిందన్నారు. విద్యార్థుల దుస్తులు, బూట్లు, ల్యాప్‌టాప్‌లు, ట్రాలీ బ్యాగులు చోరీ అయ్యాయని, దీనిపై ఈనెల 4న కొందరు విద్యార్థులు కళాశాలకు రాగానే పరిస్థితి చూసి మేనేజ్‌మెంట్‌కి మెయిల్ పెట్టగా తాము పరిశీలిస్తామని చెప్పారన్నారు. దీనిపై చర్యలు తీసుకోకపోగా ఈనెల 12వ తేదీకల్లా విద్యార్థులను రూమ్ ఖాళీ చేసి వెళ్లిపోమనడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీలో నిర్వహణ లోపం ఉందని, వెంటనే విద్యార్థుల వస్తువులు ఎవరు తీసుకెళ్లారో విచారణ చేసి వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.శివ, ఎస్.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ జేఏఓలకు పదోన్నతులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో పని చేస్తున్న పలువురు జూనియర్ అక్కౌంట్స్ అధికారులకు పదోన్నతులు కల్పిస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జంగారెడ్డిగూడెంలో జూనియర్ అక్కౌంట్స్ అధికారిగా పని చేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావుకు అసిస్టెంట్ అక్కౌంట్స్ అధికారిగా పదోన్నతి కల్పించి నిడదవోలుకు బదిలీ చేశారు. అలాగే తాడేపల్లిగూడెంలో జూనియర్ అక్కౌంట్స్ అధికారి టీ వెంకాయమ్మకు అసిస్టెంట్ అక్కౌంట్స్ అధికారిగా పదోన్నతి కల్పించి ఆమెను ఏలూరు విద్యుత్ రెవెన్యూ కార్యాలయానికి బదిలీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

యలమంచిలి: లారీ ఢీకొని మోటార్‌సైక్లిస్టు మృతి చెందాడు. వివరాల ప్రకారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం రామరాజులంక గ్రామానికి చెందిన మేడిచర్ల పూర్ణచంద్ర ఉదయభాస్కర్ (64) తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం చించినాడ వచ్చి తిరిగి బైక్‌పై వెళ్తుండగా చించినాడ వశిష్ట గోదావరి నది వంతెనపై సిమెంట్ లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో భాస్కర్ అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. భాస్కర్ సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుర్రయ్య వివరించారు.

రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాలు

భీమవరం (ప్రకాశంచౌక్): రానున్న మూడు రోజుల్లో భారీ వర్షాల వస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ప్రజలు, అధికార యంత్రాంగం అప్రమత్తతతో ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ టీఆర్ఎస్ సమావేశ మందిరం నందు కలెక్టర్ నాగరాణి వర్షాకాలం సీజన్లో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో భారీ వర్షాలు, వరదలు, తుపానులను సమర్థవంతం ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు.

క్షీరారామంలో ప్రదక్షిణకు పోటెత్తిన భక్తజనం



దీపాల కాంతిలో స్వామి దర్శనం



క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సప్త సోమవారం ప్రదక్షిణల్లో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సప్త సోమవారం ప్రదక్షిణలకు భక్తులు పోటెత్తారు. సోమవారం ప్రదోషకాలంలో భక్తులు ప్రదక్షిణలు ప్రారంభించారు. ఏడు మారేడు దళాలు చేత పట్టుకుని ఏడు ప్రదక్షిణలు చేసి దీపాలంకరణ వెలుతురులో ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి పంచహారతులు నిర్వహించారు. దాతలు భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ పసుపులేటి వాసు, అర్చకులు కిష్టప్ప, అనిల్, వీరబాబు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

హత్య కేసులో 8 మంది అరెస్ట్

దెందులూరు: మండలంలోని వీరభద్రపురం వద్ద ఇటీవల జరిగిన హత్య కేసులో 8 మందిని పెదవేగి సీఐ రాజశేఖర్ అరెస్ట్ చేసినట్లు దెందులూరు ఎస్సై ఆర్ శివాజీ తెలిపారు. 8 మంది నిందితులను భీమడోలు కోర్టులో హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు ఎస్సై చెప్పారు.

అంతర్ జిల్లాల దొంగల ముఠా అరెస్ట్

గుడివాడ రూరల్: అంతర్ జిల్లాల దొంగల ముఠాను పామర్రు, గుడివాడ సీసీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 22న పామర్రు మండలం మలయప్పన్ పేటలో నివాసముంటున్న సాలిమట్టి ప్రమీలరాణి ఇంట్లో సుమారు రూ.5 లక్షలు విలువైన 16 కాసుల బంగారు నగలతో పాటు సెల్‌ఫోన్‌ను రాత్రి ఐదుగురు వ్యక్తులు దొంగతనం చేశారు. దీనిపై పామర్రు సీఐ వి.సుభాకర్, ఎస్ఐ వి.రాజేంద్ర ప్రసాద్ రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు ప్రారంభించారు. సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్లు, సిగ్నల్స్ ఆధారంగా సీసీ కెమెరాల్లోని ఆధారాలతో వాహనాలతో పారిపోయిన దొంగలను గుర్తించారు. ఈ ఏడాది ఏప్రిల్ 8న కాకినాడకు చెందిన కొటారి శ్రీనివాస్(36), గుడివాడ నైజాంపేటకు చెందిన తిరుమలశెట్టి ధనుష్(పాండు 18), బేతవోలుకు చెందిన ప్రత్తిపాటి సంజయ్(19)లను అదుపులోకి తీసుకోగా.. ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ షబ్బీర్(19)ని మార్చి 25వ తేదీన, ఏలూరుకు చెందిన ఎస్‌కే మున్న అలియాస్ సిరి(19, ట్రాన్స్‌జెండర్)లను ఆదివారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. బాధితులు పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌ను నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ చోరీలకు పాల్పడుతున్నవారిపై విజయవాడ, ఏలూరు జిల్లా కైకలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, చిత్తూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో 110 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు.

జైలులో స్నేహం..

ఈ కేసులో అదుపులోకి తీసుకున్న ఐదుగురు నిందితులకు గుడివాడకు చెందిన గొడవర్తి కిరణ్ అలియాస్ లిక్క గంజాయి వ్యాపారం చేస్తూ పట్టుబడి జైలుకి వెళ్లిన క్రమంలో మిగిలిన వారితో స్నేహం ఏర్పడిందని డీఎస్పీ వివరించారు. వీరందరూ కలసి గుడివాడలో మద్యం, గంజాయి తాగేందుకు వచ్చి ఈ చోరీలకు పాల్పడినట్లు తమ దర్యాప్తులో వెల్లడైందన్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు తెలిపారు.

పుణ్యక్షేత్రాల వైపు ఆర్టీసీ అడుగులు

- అరుణాచలంకు ప్రత్యేక బస్సులు
- సప్త మాతృకాదర్శనం పేరుతో ప్రత్యేక ప్యాకేజీలు

నూజివీడు: ఏపీ ప్రజా రవాణా సంస్థ(ఆర్టీసీ) ఆదాయం పెంచుకునే మార్గంలో పుణ్యక్షేత్రాల వైపు అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే ప్రముఖ పుణ్యక్షేత్రాలకు బస్సు సర్వీసులను నడిపేందుకు చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే ఏలూరు జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి తమిళనాడులోని అరుణాచలంకు బస్సు సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం ఆషాఢ మాసం గురు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఈ బస్సులు ఈనెల 8న సాయంత్రం 6గంటలకు బయలుదేరి 9వ తేదీ ఉదయం శ్రీకాళహస్తిలోని దక్షిణామూర్తి, శ్రీకాళహస్తీశ్వర వాయులింగం దర్శనం, జ్ఞాన ప్రసూనాంబ దర్శనం అనంతరం కాణిపాకంలోని వినాయకుడి దర్శనం, శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటుంది. ఈనెల 10న ఉదయం గిరి ప్రదక్షిణ చేసి అరుణాచలేశ్వర దర్శన అనంతరం కంచిలోని కామాక్షి అమ్మవారిని దర్శించుకున్న తరువాత గమ్యస్థానానికి చేరుకుంటారు. ఈ టూర్‌కు ఒక్కొక్కరికి రూ.3వేలు టిక్కెట్‌తో పుష్ బ్యాక్ సీట్లతో బస్సులను ఏర్పాటు చేశారు.

సప్తమాతృకా దర్శనం

అలాగే ప్రతి ఆదివారం ఏడుగురు అమ్మవార్లను దర్శించుకునేలా సప్తమాతృకాదర్శనం పేరుతో ఆర్టీసీ యాత్రను ఏర్పాటు చేసింది. ఉదయం 4 గంటలకు బయలుదేరి ఏడుగురు అమ్మవార్లను దర్శించుకొని తిరిగి రాత్రికల్లా తిరిగి వస్తారు. కొల్లేటి పెద్దింటమ్మ, భీమవరం మావుళ్లమ్మ, పెనుగొండ వాసవీమాత, కోట సత్తెమ్మ తల్లి, ద్రాక్షారామం మాణిక్యాంబ, పిఠాపురం పురుహూతిక మాత, పెద్దాపురం మరిడమ్మ అమ్మవారులను దర్శించుకుంటారు. 36 మంది ఒకే ప్రదేశం నుంచి ఉంటే ప్రత్యేక ప్యాకేజీపై బస్సును ఏర్పాటు చేయనున్నారు. మూడు డిపోలలో ఎక్కడి నుంచైనా మనిషి ఒక్కరికి రూ.800 మాత్రమే చార్జి చెల్లిస్తే సరిపోతుంది. ఆసక్తి కలిగి వారు సమీపంలోని డిపోమేనేజర్‌ను గాని ఏలూరు 93467 67670, జంగారెడ్డిగూడెం 94910 19105, నూజివీడు 73829 01757 నంబర్లలోని సంప్రదించాలని నూజివీడు ఇన్‌చార్జి డీఎం జీ రాంబాబు కోరారు.

దాడి ఘటనలో 10 మందిపై కేసు నమోదు

కైకలూరు: వ్యక్తిపై దాడి ఘటనకు సంబంధించి పది మందిపై కేసు నమోదైంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు మండలం వదర్లపాడు గ్రామానికి చెందిన ఘంటసాల సురేష్(38) మరో నలుగురితో కలిసి శనివారం సాయంత్రం అమ్మవారి దర్శనం అనంతరం సర్కారు కాల్వ వంతెనపై సెల్ఫీ దిగుతున్నారు. అక్కడ భీమవరంనకు చెందిన యువకులతో వివాదం ఏర్పడింది. చివరకు సురేష్ తన కారులో ఆలపాడు పెట్రోల్ బంకు వరకు వచ్చాడు. ఇంతలో అంతకు ముందే భీమవరంనకు చెందిన మరో రెండు కార్లలో వచ్చిన 10 మంది సురేష్‌ను తీవ్రంగా కొట్టారు. కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సురేష్ ఫిర్యాదుపై రూరల్ ఎస్సై వి.రాంబాబు కేసు నమోదు చేశారు.

ఉపాధ్యాయుడి అరెస్ట్

భీమవరం: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణంలోని మునిసిపల్ హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్సై ఎస్‌వీవీఎస్ కృష్ణాజీ సోమవారం చెప్పారు. ఉపాధ్యాయుడ్ని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు తెలిపారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల మహిళా అధ్యక్షురాలిగా ఉండవల్లి జానకి


ఉండవల్లి జానకి

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు, ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ ఉండవల్లి జానకి తణుకు మండల మహిళా అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఈ నియామకాన్ని సోమవారం విడుదల చేశారు. దీంతో కారుమూరికి జానకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి పార్టీ కోసం మరింతగా కష్టపడతానని తెలిపారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


చిన్న పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయం పలువురు వక్తలు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక భాగ్యలక్ష్మి ప్రాథమిక పాఠశాలలో సోమవారం 40 మంది చిన్న పిల్లలకు విద్యా సామగ్రి పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్లు ఇచ్చారు. క్లబ్ అధ్యక్షుడు చిన్నం మణీంద్ర, మదన్‌మోహన్ అగర్వాల్, అనిత అగర్వాల్, సెక్రటరీ త్రిమూర్తులు, సుంకర శ్రీనివాస్, డాక్టర్ ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు, డీవీపీ విశ్వేశ్వరరావు, జగదీష్, వంగపండు రామ్మోహన్‌రావు, జి.హరిబాబు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 14 ఫిర్యాదులు


మునిసిపల్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్న అధికారులు

తాడేపల్లిగూడెం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం పలు సమస్యలపై 14 ఫిర్యాదులు వచ్చాయి. పింఛన్లకు సంబంధించి ఒకటి, ఇంజనీరింగ్ విభాగంలో ఎనిమిది, పట్టణ ప్రణాళికా విభాగంలో ఐదు ఫిర్యాదులు వచ్చాయి. కమిషనర్ ఎం.ఏసుబాబు, మున్సిపల్ ఇంజనీర్ వైవీ రమణ, అసిస్టెంట్ కమిషనర్ డి.రవికుమార్, ఏసీపీ జి.సీతారాం, మేనేజర్ ఎం.రవిసుధాకర్, ఎన్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైకి చేరుతున్న డ్రెయిన్ నీరు


డ్రెయినేజీ నీరు రోడ్డుపైకి వచ్చి అధ్వానంగా ఉన్న దృశ్యం

భీమవరం అర్బన్: మండలంలోని చినఅమిరం గ్రామంలో విశ్వకవి స్కూలుకు వెళ్లే రోడ్డులో ఇటీవల వర్షాలు పడుతుండడంతో డ్రెయినేజీలలో సిల్టు పేరుకుపోయి స్తంభించిపోయింది. దీంతో రోడ్డుపైకి డ్రెయినేజీ నీరు రావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయిన్ నీటి వల్ల రాత్రిళ్లు దోమలు విజృంభించి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు. పంచాయతీ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఈ ప్రాంతానికి వచ్చి చూసి వెళ్తున్నారే తప్ప పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఈ ప్రాంతంలో సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఆరేడులో స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన

ఉండి: మండలంలోని ఆరేడు గ్రామంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 బృందం సోమవారం పర్యటించింది. పంచాయతీ కార్యాలయం, సంపద సృష్టి కేంద్రం, మురుగు నీటి పారుదల, పారిశుద్ధ్య, వ్యక్తిగత మరుగుదొడ్లు, అంగన్‌వాడీ కేంద్రం, హెల్త్ కేంద్రం సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని రికార్డులను, సిబ్బంది పనితీరును పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్నల్ టీమ్ సభ్యులు దినేష్, రామకృష్ణ, టెక్నికల్ కో–ఆర్డినేటర్ ఎస్.ఎడ్వర్డ్, డిప్యూటీ ఎంపీడీఓ సీహెచ్ఎస్‌వీ రెడ్డి, సర్పంచ్ కె.బ్రహ్మానందం, కార్యదర్శి పి.స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటీవారి తోటలోని శ్రీవిజయ కనకదుర్గ శ్రీచక్ర సహిత బాల త్రిపుర సుందరి అమ్మవారి వెండి మకర పీఠానికి సోమవారం దాతలు 100 గ్రాముల వెండిని సమర్పించారు. పట్టణానికి చెందిన నైనాలశెట్టి లీలా సుబ్రహ్మణ్య ప్రసాద్ (లీలా) వెంకటలక్ష్మి దంపతులు వెండిని ఆలయ అభివృద్ధి కమిటీకి అందించారు. ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ దాతలకు పూజలు చేసి అమ్మవారి చిత్రపటాన్ని అందించి సత్కరించారు.

గూడెం గుండెల్లో నిలిచిన మహానేత

- ఒక వైపు వ్యవసాయానికి.. మరో వైపు ప్రజలకు
- పట్టా పొందిన వైద్యుడిగా సమాజానికి శస్త్ర చికిత్స
- రైతులకు, ప్రజలకు ప్రాణం పోసిన వైద్యుడు వైఎస్సార్

నాటి పాలకుల కబంధ హస్తాల్లో చిక్కి శల్యమైన వ్యవసాయ రంగాన్ని, సమాజాన్ని తన సుపరిపాలన అనే ఔషధంతో అసలు సిసలైన వైద్యుడిగా ఆయువు పోసిన వైద్యోనాథుడు మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. వ్యవసాయ రంగం నాడు 'వ్యయ' సాయంగా మారిన తరుణంలో తన సుసంపన్నమైన అడుగులతో లాభసాటిగా మార్చిన మహనీయుడు ఆయన. గోదావరి చెంతనున్నా ఏడాదికి రెండు పంటలు పండటమే గగనంగా మారిన రైతుకు ఉచిత విద్యుత్ అందించి బీడువారిన భూముల్లో సిరులు పండించిన రైతు బాంధవుడు వైఎస్సార్. అలాగే, కుళ్లు అనే క్యాన్సర్ బారినపడిన సమాజానికి తన పాలన ద్వారా శస్త్ర చికిత్స చేసిన సామాజిక వైద్యుడు వైఎస్ రాజశేఖరరెడ్డి అని చెప్పక తప్పదు. ఒక తల్లికి బిడ్డగా, అన్నా అని పిలిచిన చెల్లెమ్మలకు అన్నగా, అడిగిందే తడవుగా లేదనకుండా అందరికీ అన్నీ తానై పిలిస్తే పలికే వ్యక్తిగా అందరి నోటా ముద్దుగా వైఎస్సార్ అని పిలుచుకునే జనహృదయ నేత ఆయన. ఈ నెల 8వ తేదిన డాక్టర్ వైఎస్సార్ జయంతి సందర్భంగా సాక్షి అందిస్తున్న చిరు జ్ఞాపకం.

తాడేపల్లిగూడెం రూరల్: రైతే దేశానికి వెన్నుముక.. సమాజమే దేవాలయమని నమ్మిన వ్యక్తి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి. అప్పటి వరకు ఉన్న పాలకుల పిడికిలిలో ఉక్కిరిబిక్కిరై తల్లడిల్లుతున్న రైతుకు, సమాజానికి విముక్తి కల్పించిన సామాజిక ఉద్యమకారుడు ఆయన. నాటి దుష్ట పాలనపై 2003వ సంవత్సరంలో పాదయాత్ర చేపట్టి తరువాత నాటి అధికార టీడీపీ ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన నాయకుడు మహానేత వైఎస్సార్. ప్రభుత్వ పాలనను పాదయాత్ర ద్వారా ఎండగట్టడంతో పాటు ఎన్నో సాహసోపేతమైన హామీలను ఇచ్చి ప్రజల హృదయాలను గెలుచుకున్న మహానేతగా వైఎస్సార్‌ను పేర్కొనవచ్చు. వైఎస్సార్ ఇచ్చిన హామీల్లో రైతులకు ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ ప్రతిష్టాత్మకమైనవిగా చెప్పొచ్చు. నాడు ఉచిత విద్యుత్ ఇస్తానంటే, బట్టలు ఆరేసుకోవడానికి మాత్రమే తీగలు పనికొస్తాయన్న ఎందరి నోళ్లకో తాళాలు వేసిన మహానేత. ఆయన చెప్పినట్టుగానే 2004లో వైఎస్సార్ విజయాన్ని చేజిక్కించుకొని నాటి టీడీపీ ప్రభుత్వ దుర్భర పాలనకు చరమగీతం పాడారు. సీఎంగా తొట్టతొలి సంతకాన్ని రైతుల రుణమాఫీ, ఉచిత విద్యుత్, డ్వాక్రా రుణమాఫీ వంటి ఎన్నో దస్త్రాలపై సంతకం చేసి చరిత్ర సృష్టించారు. అంతే కాదు ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్, రాజీవ్ గృహకల్ప, ఇందిరా ఆవాస్ యోజన వంటి పథకాలను ప్రవేశపెట్టి వైద్యం, ఉన్నత విద్య, గూడు కల్పించారాయన. ఉభయగోదావరి జిల్లాల రైతాంగానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును చేపట్టిన రైతు బాంధవుడు వైఎస్సార్. వైద్య వృత్తిలో పట్టా పొందినప్పటికీ స్వతహాగా రైతు కుటుంబానికి చెందిన వైఎస్సార్ పాడిపంటలపై అమిత ప్రేమాభిమానాలు వ్యక్తం చేసేవారు. తాడిపూడి కాలువ, ఎర్ర కాలువ ఆధునికీకరణ ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రజాకర్షక నాయకుడిగా 2004 నుంచి 2009వరకు ఆయన అందించిన పథకాలే మరలా అదే ఏడాది ఎన్నికల్లో కాంగ్రెస్‌కు విజయాన్ని కట్టబెట్టిందని చెప్పక తప్పదు.


చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ వైఎస్ఆర్ (ఫైల్)


వైద్యుడిగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి (ఫైల్)


తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో నాడు ఇందిరమ్మ గృహ సముదాయానికి శంకుస్థాపన చేసిన దృశ్యం (ఫైల్)

మహానేత పాలనలో సస్యశ్యామలం

2004 నుంచి 2009వ సంవత్సరం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జీవించే వరకు తాడేపల్లిగూడేనికి చేసిన మేలు అంతాఇంతా కాదు. మెట్ట రైతాంగం భూములను సస్యశ్యామలం చేసిన వ్యక్తి వైఎస్ఆర్. చినుకు పడితేనే గాని సాగు కష్టంగా మారిన తరుణంలో విద్యుత్‌పై పంట పండించడం నరకప్రాయంగా మారింది. ఈ తరుణంలోనే ఉచిత విద్యుత్ ప్రకటించి మెట్ట రైతాంగం ఆశలను చిగురింపజేశారు. తాడిపూడి, ఎర్ర కాలువలను అందుబాటులోకి తెచ్చి మెట్ట భూముల్లో సిరులు పండించడమే కాదు భూమి విలువను పెంచిన వ్యక్తి డాక్టర్ వైఎస్సార్. నాడు వైఎస్సార్ నిర్మించిన కాలువల ద్వారా నేడు ఏటా మూడు పంటలు పండించే స్థాయికి రైతు ఎదిగాడు. వరితో పాటు దేశంలోనే రెండో ఉద్యాన విశ్వ విద్యాలయం ద్వారా ఉద్యాన పంటలకు, వర్సిటీలో పని చేసే వారికి ఉపాధి మార్గాన్ని చూపించారు.

సమ్మె విజయవంతానికి బైక్ ర్యాలీ


తణుకు అర్బన్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు


తాడేపల్లిగూడెం (టీఓసీ): మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తణుకు అర్బన్: కార్మికులకు తీవ్ర హాని కలిగించే విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెచ్చిన నాలుగు లేబరు కోడ్లను రద్దు చేయాలని కోరుతూ జులై 9న నిర్వహించనున్న కేంద్ర కార్మిక సంఘాల దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం కావాలని సోమవారం పట్టణంలో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులకు జీవించే హక్కు హరిస్తూ పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తుందన్నారు. జులై 9 సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బైక్ ర్యాలీలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు బొద్దాని నాగరాజు, ఎ.అజయకుమారి, చిక్కాల దుర్గప్రసాద్, ఎస్.ఫణీంద్ర, కురెళ్ల శ్రీనివాస్, గారరంగారావు, కరుటూరి ప్రసాద్, గుబ్బల గోపి, మందుల ముత్తయ్య, తుమ్మలపల్లి శ్రీనివాస్, పీఎల్ నరసింహారావు, తోట నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గూడెంలో మోటార్ సైకిల్ ర్యాలీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): లేబర్ కోడ్స్ రద్దుకై, కార్మికుల సమస్యల పరిష్కారానికి జులై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ పిలుపునిచ్చారు. సీఐటీయూ తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మోటార్ సైకిల్ ర్యాలీ స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనం నుంచి ప్రారంభించారు. పట్టణం నుంచి పెంటపాడు వరకు మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సంక్షోభంలో గీత కార్మికులు

ఆకివీడు: కల్లు గీత కార్మికులు రాష్ట్రంలో సంక్షోభంలో పడ్డారని గీత కార్మిక సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి బొక్కా చంటి ఆరోపించారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో సోమవారం ఆకివీడు సర్కిల్‌లోని గీత కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశాలను జిల్లా కలెక్టర్ అమలుజేసే విధంగా ఈ నెల 14న గీత కార్మికులు మోకులు ధరించి రావాలని పిలుపునిచ్చారు. మద్యం ఆదాయం కావాలా? ప్రజల ఆరోగ్యం కావాలా? అనేది ప్రభుత్వం తేల్చుకోవాలని హెచ్చరించారు. బెల్టు షాపులు పెడితే బెల్టు తీస్తామని, బెల్టు షాపులపై కొరడా ఝులిపిస్తామని చెప్పి వారిపై జాలి చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఎం.సత్యనారాయణ, వి.సత్యనారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాస్, పి.సహదేవుడు, ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ బ్యాంకులను బలోపేతం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశ ఆర్థిక సమగ్రాభివృద్ధికి తోడ్పతున్న ప్రభుత్వ బ్యాంకులను మరింత బలోపేతం చేయాలని, జులై 9వ తేదీన కార్మికవర్గ సార్వత్రిక సమ్మెలో బ్యాంకు యూనియన్లు పాల్గొని విజయవంతం చేయాలని బ్యాంకు ఉద్యోగుల కో–ర్డినేషన్ కమిటీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో బి.ఏడుకొండలు, లింగంపల్లి గాంధీ, పి.సత్యనారాయణ, బి.దివ్య, రజనీ మాట్లాడుతూ జాతీయ బ్యాంకుల్లో స్టాఫ్ రిక్రూట్‌మెంట్ అమలుచేయాలని, ఉద్యోగులపై అనవసర ఒత్తిడి తగ్గించాలని, అసంఘటిత కార్మికులపై పెంచుతున్న పది గంటల పనిభారం చట్టం ఉపసంహరించుకోవాలని కోరారు.

పదోన్నతితో మరింత బాధ్యత

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ కార్యాలయంలోని ఈఆర్ఓ సెక్షన్ జూనియర్ అకౌంట్ ఆఫీసర్ టి.వెంకాయమ్మ పదోన్నతి పొందారు. ఏలూరు టౌన్ విద్యుత్ రెవెన్యూ కార్యాలయం అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె మాట్లాడుతూ పదోన్నతి మరింత బాధ్యతను పెంచిందన్నారు. విద్యుత్ సిబ్బంది, కాంట్రాక్టర్లు కె.ఆర్.దయాల్, పి.మాధురి, రమణమూర్తిలు వెంకాయమ్మకు అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో సౌత్ సబ్ స్టేషన్ పరిధిలో పెంటపాడు, మార్కెట్ ఫీడర్లకు సంబంధించి తాళ్లముదునూరుపాడులోని కొత్త విద్యుత్ లైన్ల నిర్మాణ పనుల్లో భాగంగా ఈ నెల 8వ తేదీ మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ తాడేపల్లిగూడెం డివిజన్ ఈఈ కె.నరసింహమూర్తి వెల్లడించారు. పెంటపాడు నుంచి తాళ్లముదునూరుపాడు, భాగ్యలక్ష్మిపేట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఏఎల్ఎం గోపిపై కేసు నమోదు

తణుకు అర్బన్: తణుకు డీ2 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఉద్యోగిపై దాడి చేసిన ఘటనపై తణుకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 4వ తేదీన సబ్‌స్టేషన్‌లో విధుల్లో ఉన్న జూనియర్ లైన్‌మెన్ జగదీష్‌పై అసిస్టెంట్ లైన్‌మెన్ కొప్పిశెట్టి గోపి దాడి చేసిన ఘటనలో జగదీష్ తలకు తీవ్ర గాయం కాగా తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దాడికి సంబంధించి జగదీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పట్టణ ఏఎస్సై సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

దిగొచ్చిన మాంసాహార ధరలు

- ఉత్పత్తి పెరగడం, అమ్మకాలు తగ్గడంతో ధరలు తగ్గిన వైనం
- చికెన్ కిలో రూ.159, మటన్ కిలో రూ.800
- కొనుగోళ్లకు ఉత్సాహం చూపిస్తున్న మాంసాహారులు
- పోటాపోటీగా ధరలు తగ్గించిన ఫ్లెక్సీల ఏర్పాటు



మేకపోతు మాంసం కిలో రూ.800 ఫ్లెక్సీతో మాంసం దుకాణం



వీరభద్రపురంలో బాయిలర్ కోడి మాంసం ధర తెలిపే ఫ్లెక్సీ

తణుకు అర్బన్: చికెన్, మటన్ ధరలు దిగిరావడంతో మాంసాహారులు లొట్టలేసుకుంటూ లాగించేస్తున్నారు. ఇప్పటి వరకు ఈ రెండు రకాల మాంసం ధరలు కొండెక్కి కూర్చోవడంతో మాంసాహార ప్రియులు కొనుగోళ్లకు కొంచెం వెనకాడే పరిస్థితి నెలకొంది. కానీ నేడు వ్యాపారుల మధ్య వచ్చిన పోటీ తదితర కారణాలతో చికెన్ బ్రాయిలర్ ధర కిలో రూ.159, మటన్ కిలో రూ.800 తమ దుకాణాల ముందు కొందరు వ్యాపారులు ఫ్లెక్సీలు ఏర్పాటుచేసి విక్రయాలు చేస్తుండడంతో మాంసాహారులు ఉత్సాహంగా కొనుగోళ్లకు సిద్ధమవుతున్నారు.

ఉత్పత్తి ఎక్కువ.. వాడకం తక్కువ

చికెన్ ఉత్పత్తి అధికంగా ఉండడంతో మేత ధరలు పెరగడంతో హోల్‌సేల్‌లో కోడి లైవ్ ధర విపరీతంగా తగ్గిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో బర్డ్‌ఫ్లూ విలయ తాండవం అనంతరం చికెన్ కిలో ధర రూ.280 వరకు ఎగబాకింది. కానీ నేడు ఉత్పత్తి భారీగా రావడం, అమ్మకాలు తగ్గడంతో ధర తగ్గించి అమ్మకాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. నేడు చికెన్ ఉత్పత్తి భారీగా నిల్వ ఉండడంతో హోల్‌సేల్ లైవ్ ధర రూ.80కి పడిపోయింది. దీంతో రిటైల్ వ్యాపారుల్లో కొందరు బాయిలర్ లైవ్ ధర రూ.99, కిలో ధర రూ.159 అమ్మకాలు చేస్తున్నారు. చికెన్ ప్రియులు గతం కంటే రెండింతలు మాంసం కొనుగోలు చేస్తున్నారు. ఇక మటన్ ధర పట్టణ పరిధిలో అధిక శాతం దుకాణాల వద్ద రూ.800 ఫ్లెక్సీలు పెట్టి విక్రయిస్తున్నారు. ఇక గ్రామాల్లో అయితే రూ.600 ఫ్లెక్సీలు పెట్టి విక్రయిస్తున్నట్లుగా తెలుస్తోంది. బర్డ్ ఫ్లూ సోకిన సమయంలో మటన్ విక్రయాలు విపరీతంగా పెరగడంతో అప్పట్లో రూ.1000 నుంచి రూ.1200 వరకు పెంచి అమ్మకాలు చేశారు. జీవాల ఉత్పత్తి పెరగడం, దానికి తోడు అమ్మకాలు నీరసంగా ఉండడంతో నేడు మటన్ వ్యాపారులు భారీగా ధర తగ్గించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మాంసాహారులు భలే ఛాన్సులే అనుకుంటూ గతంలో అరకేజీ కొనుగోలు చేసే వారు సైతం నేడు కిలోకి పైగా కొనుగోలు చేస్తున్నారు. మటన్ విక్రయాలకు సంబంధించి జీవాల శాతం పెరగడంతో పాటు పోషణ భారంగా మారిన పరిస్థితుల్లో ధరలు తగ్గించి అమ్మకాలు పెంచాలనే ఉద్దేశ్యంతో వ్యాపారులు ఉన్నట్లు తెలుస్తోంది. వర్షాకాలం కావడంతో జీవాలను అధికంగా పెట్టుకున్నా పలు రకాల వ్యాధులు వచ్చే ప్రమాదం ఉండడంతో తక్కువ ధరలకు విక్రయాలు చేస్తున్నట్లుగా వ్యాపారులు చెబుతున్నారు.

పోటాపోటీగా ఫ్లెక్సీలు

చికెన్, మటన్ ధరలకు సంబంధించి తణుకు ఇతర పట్టణాల్లో పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి మరీ అమ్మకాలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం వ్యాపారుల మధ్య పోటీ పెరిగి ఈ తరహా విక్రయాలు చేస్తున్నారని అతి కొద్ది రోజుల్లో రిటైల్ వ్యాపారులు సమావేశమై తిరిగి హోల్‌సేల్ ధరలకు సంబంధం లేకుండా సిండికేట్‌గా మారి ధరలు పెంచి విక్రయాలు చేసేందుకు కార్యాచరణ చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మునిసిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కార్మికులకు జీతాలు పెంచాలని, వారందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని, పర్మినెంట్ కార్మికులకు పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని ఏఐటీయూసీ ఏరియా కమిటీ నాయకులు సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. కార్మిక నాయకులు మాట్లాడుతూ మునిసిపల్ రంగంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు, పార్కు కూలీలకు, ఆఫీస్, టౌన్ ప్లానింగ్ సిబ్బందికి రూ 21,000, రూ.24,500 పెంచి ఇవ్వాలని, శాశ్వత కార్మికులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న డీఏలు, విశ్రాంత కార్మికులకు గ్రాట్యుటీని ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓవీ రాజు, కార్యదర్శి ఎం.హరీష్, కళింగ లక్ష్మణరావు, యాళ్లబండి రాజేంద్రప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తాడికొండ శ్రీనివాసరావు, ముత్యం, కాటంరాజు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

భీమవరం: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి చేరుకోవాలని దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందర కుమార్ అన్నారు. గంటా పాల్‌రోనాల్డ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని రాయలంలోని లూథరన్ చర్చ్‌లో సోమవారం 350 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఎల్ఈడీ ప్యాడ్స్ పంపిణీ చేశారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పాల్గొన్నారు.